భవనాలు శిథిలం బతుకులు భయం భయం

ముంచంగిపుట్టు మండలంలో పలుశాఖల ఉద్యోగుల కోసం నిర్మించిన క్వార్టర్స్‌లో కొన్ని కూలిపోగా.. మరికొన్ని కూలిపోయే దశకు చేరుకున్నాయి. ఇటీవల జోరుగా వర్షాలు కురుస్తుండడంతో ఏ క్వార్టర్ ఏ సమయంలో నేలమట్టమవుతుందోనన్న భయంతో బిక్కుబిక్కు మంటూ ఉద్యోగులు కుటుంబాలతో సహా కాలం వెల్లదీస్తున్నారు. కొత్తభవనాలు నిర్మించడంలో అధికరులు విఫలమయ్యేరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


ముంచంగిపుట్టులో ఉపాధ్యాయుల క్వార్టర్స్‌లో పాడైన తలుపు


ముంచంగిపుట్టులో పూర్తిగా శిథిలావస్థలో ఉన్నవైద్య సిబ్బంది క్వార్టర్స్


బంగారుమెట్టలో పాడైన ఉపాధ్యాయుల క్వార్టర్స్


టార్పాలిన్లు కప్పిన ఐటీడీఏ క్వార్టర్స్

- పాడైన కిటికీలు, తలుపులు, బీటలు వారిన గోడలు
- టార్పాలిన్లు కప్పి నివాసముంటున్న ఉద్యోగులు
- శిథిల భవనాల వద్ద విష సర్పాల సంచారం

ముంచంగిపుట్టు: మండలంలోని ఐటీడీఏ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయుల,ఎంపీడీవోల క్వార్టర్స్ భవనాలు శిథిలావస్థకు చేరాయి. 40 ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు కావడంతో గోడలు బీటలు వారి తలుపులు, కిటికీలు పాడైపోయాయి. చిన్న పాటి వర్షానికే కొన్నిభవనాలు కారిపోతుండడంతో కప్పులపై టార్పాలిన్లు కట్టుకుని ఉద్యోగులు నివసించాల్సి వస్తోంది. ఎప్పుడు ఏ భవనం పడిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రం ముంచంగిపుట్టులో ఐటీడీఏ, వైద్య సిబ్బంది,ఉపాధ్యాయుల క్వార్టర్లతో పాటు లక్ష్మీపురం, పనసపుట్టు, పెదగూడ, బంగారుమెట్ట, లబ్బూరు గ్రామాల్లో ఉద్యోగులు నివసించేందుకు వీలుగా భవనాలు నిర్మించారు. వీటిలో చాలా భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొంత మంది ఉద్యోగులు,ఉపాధ్యాయులు వాటిలో సర్దుకుపోయి నివాసం ఉంటున్నారు. మరికొంత మంది అద్దె భవనాల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్వార్టర్స్ చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి విష సర్పాలు సంచరిస్తున్నాయి. తరచూ ఇళ్లల్లోకి అవి వస్తుండడంతో ఉద్యోగుల కుటుంబ సభ్యులు భయాందోళనలు చెందుతున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేయాలని, పూర్తిగా శిథిలమైన వాటిని వెంటనే కూల్చివేసి నూతన భవనాలు నిర్మించాలని ఉద్యోగులు కోరుతున్నారు.


ముంచంగిపుట్టులో ఎంపీడీవో క్వార్టర్స్ పరిస్థితి

సర్వేతో సరి

క్వార్టర్స్ పరిస్థితి గతంలో ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లడంతో పలుమార్లు భవనాలను స్థితిగతులపై అధికారులు సర్వే చేశారు. భవనాల పరిస్థితి దారుణంగా ఉండటంతో కూల్చివేయాలని, ప్రస్తుతం నివాసం ఉంటున్న వారు సైతం భవనాలను ఖాళీ చేయాలని సర్వే అధికారులు సూచించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించి, నిధులు మంజూరైన వెంటనే నూతన భవనాల నిర్మాణం ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. దీంతో క్వార్టర్స్ బాగుపడతాయని, నివాస సమస్య తీరుతుందని ఉద్యోగులు భావించారు. కానీ సర్వేతోనే అధికారులు సరిపెట్టారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం



ఉపాధ్యాయుల క్వార్టర్స్ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో కొంతమంది ఖాళీ చేశారు. మరికొంత మంది భవనాలపై టార్పాలిన్లు కట్టుకుని నివసిస్తున్నారు. శిథిల భవనాల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. నిధులు మంజూరై, భవనాలు సమకూరితే ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు వసతి సమస్య తీరుతుంది.

– స్వర్ణలత, ఏటీడబ్ల్యూవో, ముంచంగిపుట్టు మండలం.

చాలా మంది ఖాళీ చేశారు



ఎంపీడీవో సిబ్బంది క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో చాలా మంది ఇప్పటికే భవనాలు ఖాళీ చేశారు.మరి కొంత మంది భవనాలపై టార్పాలిన్లు వేసి నివసిస్తున్నారు.శిథిల భవనాల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం.

– కె.ధర్మారావు, ఎంపీడీవో, ముంచంగిపుట్టు

క్లుప్తంగా

కబడ్డీలో డిగ్రీ విద్యార్థినుల సత్తా


విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వసుధ

రంపచోడవరం: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నిర్వహించిన ఇంటర్ కాలేజియేట్, ఇంటర్ యూనివర్సిటీ సెలక్షన్స్‌లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తా చాటినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ తెలిపారు. జి.మామిడాడలోని డీఎల్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 12,13 తేదీల్లో జరిగిన పోటీల్లో లీగ్ మ్యాచ్ నాలుగో స్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ కబడ్డీ ఉమెన్స్ టీమ్‌కి బీఎస్సీ బోటనీ తృతీయ సంవత్సరం విద్యార్థిని ఎం.ప్రవీణ, బీఏ ఎకనామిక్స్ విద్యార్థిని పి.శ్రావణి సంధ్య ఎంపికైనట్లు తెలిపారు. తమిళనాడులో అక్టోబర్ 29 నుంచి నవబంరు 2 వరకు జరిగే ఉమెన్స్ కబడ్డీ పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. విద్యార్థినులను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

గంగవరం: బాలికల విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఏజెన్సీ జిల్లా విద్యాశాఖాధికారి వై.మల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం కొత్తాడ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యాలయంలో ఫార్మేటివ్ టు పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాలయంలో బాలికల హాజరు, రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐకి సన్మానం


సీఐను సన్మానిస్తున్న ఎంపీపీ రమేష్, వైస్ ఎంపీపీ నూకాలు

కొయ్యూరు: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన స్థానిక సీఐ శ్రీనివాసరావును మంగళవారం ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు సన్మానించారు. శ్రీనివాసరావు గతంలో ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించి అనేక అంశాలపై చర్చించారు. సర్పంచ్‌లు రీముల శ్రీను,కోడా రాజుబాబు, నాయకులు నాగేంద్ర, కుశల,కొండబాబు పాల్గొన్నారు.

వేలిముద్రలు పడక రేషన్ షాపుల వద్ద ఇబ్బందులు

ఎటపాక: రేషన్ బియ్యం కోసం లబ్ధిదారులు డిపోల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆకుల వెంకటరామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారుల వేలిముద్రలు సరిగా పడక పోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. రేషన్ బియ్యం తీసుకునే పరిస్థితి లేదని, గడువు కూడా ముగుస్తుండడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. జగనన్న పాలనలో ఇంటింటికీ రేషన్ పంపిణీ సక్రమంగా జరిగిందని, ఇప్పుడు రేషన్ కోసం కూలి పనులు మానుకుని దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని తెలిపారు. చట్టి కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం సాగుతోందని, దీనిని కట్టడిచేసి పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు రేషన్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కురిడి పాఠశాల సందర్శన


పరిశీలిస్తున్న ఎంఈవో సుందర్‌రావు

డుంబ్రిగుడ: మండలంలోని కురిడి జీపీఎస్ పాఠశాలను ఎంఈవో–1 శెట్టి సుందర్‌రావు మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అందిస్తున్న బోధనపై ఆరాతీశారు. విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు అక్షరాలను గుర్తుపట్టే విధంగా బోధిస్తుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నేతల సంతకాల సేకరణ

అడ్డతీగల: ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం అడ్డతీగలలో పీసీసీ కార్యదర్శి, పీసీసీ డెలిగేట్ దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. వారపు సంతలో, ఇంటింటికీ వెళ్లి సంతకాలను సేకరించారు.

వ్యసనాలకు బానిసలు కావద్దు


గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న సీఐ

ఎటపాక: గంజాయి నిర్మూలనకు యువత కృషిచేయాలని ఎటపాక సీఐ కన్నపరాజు అన్నారు. మంగళవారం వైటీసీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, గంజాయి వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. యువత సమాజాభివృద్ధికి సహకరించి తల్లి దండ్రులకు,గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు.గంజాయి రవాణాపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వృత్తి శిక్షణలో మంచి తర్ఫీదు పొంది భవిష్యత్తుకు మంచి పునాది వేసుకోవాలని సూచించారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి


మాట్లాడుతున్న ఎస్‌ఐ రామకృష్ణ

ముంచంగిపుట్టు: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయించేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ జె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బాణ సంచా అమ్మకాలు జరిపే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. బాణసంచా తయారీ కేంద్రాలు,నిలువ ప్రదేశాలను నివాస గృహాలకు దూరంగా ఉంచాలన్నారు. లైసెన్స్ లేకుండా అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ: మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, నూతన జాతీయ రహదారిపై అప్రమత్తంగా ప్రయాణం చేయాలని, రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని అరకులోయ సీఐ హిమగిరి అన్నారు. చాపరాయి వద్ద మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వాహనదారులకు సూచించారు. పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో మితిమీరిన వేగంతో పర్యాటకుల వాహనాలు వస్తున్నాయని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ కె.పాపినాయుడికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వనరుల కేంద్రం ఏడీఆర్ ప్రభాకర్

చింతపల్లి: గిరిజన రైతులు పంటల్లో ఎరువుల వినియోగం తగ్గించడంతో పాటు యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్ తెలిపారు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలో మామిడిపల్లిలో మంగళవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగులు మందుల వినియోగం తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవో లకే పాత్రుడు, వ్యవసాయాధికారి మధుసూదన్‌రావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


ట్యాంకు నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ పుష్పలత తదితరులు

చింతపల్లి: మేజర్ పంచాయతీ చింతపల్లి పరిధిలో గల అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ దురియా పుష్పలత తెలిపారు. జల్‌జీవన్ ద్వారా మంజూరైన తాగునీటి పథకం నిర్మాణ పనులను మంగళవారం గడపరాయిలో ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో గల అన్ని వీధుల్లో తాగు నీరు, రోడ్లు,డ్రైనేజీలు,వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు, నాయకులు ముత్తా శ్రీనివాస్,లోవ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పాల్గుణకు సన్మానం


మాజీ ఎమ్మెల్యే పాల్గుణను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నేతలు

ముంచంగిపుట్టు: వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను మండల వైఎస్సార్‌సీపీ నేతలు ఘనంగా సన్మానించారు. మంగళవారం మండల కేంద్రానికి వచ్చిన పాల్గుణను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ కష్ట పడి పని చేస్తే వైఎస్సార్‌సీపీలో ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందన్నారు. రానున్న సర్పంచ్,ఎంపీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలిచి,వైఎస్సార్‌సీపీ సత్తాను తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాబూరావు, ఎంపీటీసీ గణపతి, జిల్లా, మండల వైఎస్సార్‌సీపీ నేతలు జగబంధు, గాసిరావు, రామ్మూర్తి, సులేమాన్, తిరుపతి, సన్యాసిరావు, దేవ, రాంప్రసాద్, పిత్‌బాస్, గౌరీశంకర్, హనుమంతు, పులిరాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

● చెత్త చెత్తగా...

కళాశాలకు వెళ్లే మార్గంలో పేరుకుపోయిన చెత్త



ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టు నుంచి పెద్దపుట్టుకు వెళ్లే మార్గంలో భారత్ గ్యాస్ గోదాం సమీపంలో రోడ్డు పక్కనే చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది.ఈ మార్గంలో రాకపోకలు చేసే ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, కించాయిపుట్టు, జర్రెల, జర్జుల, కరిముఖిపుట్టు పంచాయతీలకు వెళ్లే గిరిజనులు ప్రతి రోజు ముసుకొని రాకపోకలు రాకపోకలు సాగిస్తున్నారు.మండల కేంద్రంలో సేకరించిన చెత్తను రహదారి పక్కనే వేయడంతో భారీగా పేరుకుపోయింది. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు పక్కనే చెత్త వేయకుండా చూడాలని,డంపింగ్ యార్డుకు ప్రత్యేక స్థలం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సౌజన్య


అడ్డతీగలలో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో క్రాంతికుమారి

చింతపల్లి: బాల్యవివాహాలతో అనర్థాలు తప్పవని తాజంగి క్లస్టర్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌజన్య అన్నారు.మంగళవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలల సంరక్షణపై తాజంగి పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల పుట్టబోయే బిడ్డలతో పాటు తల్లులకు శారీరక,మానసికంగా వచ్చే అనారోగ్య సమస్యలను వివరించారు. అనంతరం బాలికలకు బాలల హక్కులు,చట్టాలపై వ్యాసరచన పోటీలు, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.పడాల్‌దాస్,ఉపాధ్యాయులు నాగలక్ష్మి,శేషమాంబ,ప్రియాంక,శాంతికుమారి,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: బాల్యవివాహాల కారణంగా పలు ఇబ్బందులు వస్తాయని ఐసీడీఎస్ సీడీపీవో పి.క్రాంతి కుమారి తెలిపారు. బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక ఆశ్రమబాలికోన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, బాపనమ్మ, స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ పీడీ సీహెచ్ ఝాన్సీబాయి తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలు అనర్థదాయకమన్నారు. బాల కార్మికులు, లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా నిరోధక చట్టం , లేబర్ లా చట్టంపై అవగాహన కల్పించారు. సీడీపీవో పీవో బాలదేవి మాట్లాడుతూ ఆకుకూరలు, పండ్లు తింటే రక్తహీనత నివారించవచ్చని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి, ఏపీఎం ఈశ్వరబాబు నాయుడు, ఎస్ఎస్ఎఫ్ జిల్లా ప్రముఖ్ ఎం.మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ బాలికాదినోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. హెచ్‌ఎం నాగసుశీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ సీడీపీవో సుజాత బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలను వివరించారు. సూపర్‌వైజర్లు అమ్మిరాజు, అంగన్‌వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, కుమారి, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.


రాజవొమ్మంగి ఆశ్రమ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

పోషకాహారం తీసుకోవాలి

గంగవరం: బాలింతలు, గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని మోహనాపురం సర్పంచ్ కురసం అక్కమ్మ తెలిపారు. నూగుమామిడి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, మహిళా పోలీసు సౌజన్య , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయి

సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన


భూమి పూజ చేస్తున్న ఎంపీపీ బోయిన కుమారి

గూడెంకొత్తవీధి: జెడ్పీటీసీ కిముడు శివ రత్నం కోటా నిధులు రూ.15 లక్షలతో గూడెంకొత్తవీధిలో నిర్మించనున్న సులభ్ కాంప్లెక్స్‌కు ఎంపీపీ బోయిన కుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుభద్ర, వైస్ ఎంపీపీ దేముడు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్, యూత్ అధ్యక్షుడు బాబీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నారాయణ, వాణిజ్య విభాగం అధ్యక్షుడు రాజేష్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ మజీద్, ఎంపీటీసీలు కొర్ర భీమ్‌రావు, మొట్టడం సత్యనారాయణ, అడనా లోవకుమారి, పసుపులేటి నాగమణి, పోతురాజు కృష్ణమూర్తి, కో ఆప్షన్ సభ్యులు దావీద్, కంకిపాటి వీరేంద్ర ప్రసాద్,ముర్ల కమలమ్మ సిరిబాల బుజ్జిబాబు, గూడెంకొత్తవీధి వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కొర్రా నూకరాజు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

రంపచోడవరం: అనారోగ్యం బారిన పడి ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న 20 మందికి ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మంగళవారం సీఎం సహాయ నిధులు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీతపల్లి గుడి చైర్మన్ కోసు నాగన్నదొర తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్ :
9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com